సాక్షి సిద్దిపేట

బుధవారం ; 8 ; ఫిబ్రవరి ; 2023



నీటి యాజమాన్యంతో దిగుబడి

కూరగాయల సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించ వచ్చని సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింగ్‌రావు సూచించారు. 8లో..



అయ్యో పాపం పసిగుడ్డు

అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు న్యాల్‌కల్ మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని రోడ్డు పక్కన వదలి వెళ్లారు. 8లో..



బ్రహ్మోత్సవాలకు సిద్ధం 9లో..

నంగునూరు తోకల కొండపై వెలసిన సీతారామ చంద్రస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

డబుల్ ఇళ్ల చిక్కుముడి!

ప్రస్తుతం మల్లన్నసాగర్ నిర్వాసితుల తాత్కాలిక నివాసం

- సమస్యలు పరిష్కరిస్తేనే ఖాళీ చేసే పరిస్థితి
- లబ్ధిదారుల జాబితా ప్రకటనతో తెరపైకి సమస్య
- గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ బల్దియాలో అధికారులకు సవాలే



గజ్వేల్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీకి అధికారులు జాబితా విడుదల చేయడంతో కొత్త సమస్య తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఆ ఇళ్లల్లో మల్లన్నసాగర్ నిర్వాసితులు నివాసం ఉంటున్నారు. వాటిని ఖాళీ చేయాలంటే వారి సమస్యలన్నీ పరిష్కరించాల్సి ఉంది. అలా జరిగితే తప్ప పట్టణ పేదలకు ఇవ్వడానికి మార్గం సుగమమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు జాబితాలో అర్హులకు చోటు దక్కలేదని వందలాదిమంది రోడ్డెక్కారు. అలాగే మరోసారి దరఖాస్తులు అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సమస్యను పరిష్కరించడం అధికారులకు సవాల్‌గా మారింది.

మున్సిపాలిటీకి మొత్తం 1,250 డబుల్ ఇళ్లను మంజూరు చేశారు. ఈ మోడల్ కాలనీకి సంబంధించి సీఎం కేసీఆర్ 2015లో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. కాలనీవాసులకు రోడ్లు, మంచీనీరు, షాపింగ్ కాంప్లెక్స్, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు తదితర సదుపాయాలు కల్పించారు. ఈ కాలనీలో 156 బ్లాకులుగా ఒక్కో ఇళ్లు 570 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించారు. ఒక్కో బ్లాకులో కింద నాలుగు, పైన నాలుగు(మొత్తం 8 ఇళ్లు) రెండు ఫ్లోర్లుగా నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తులు స్వీకరించి కుటుంబ స్థితిగతులు సమగ్రంగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీని ప్రకారం ఈనెల 3న అధికారులు లబ్ధిదారుల జాబితా ప్రకటించారు. దీంతో కొత్త సమస్య తెరపైకి వచ్చింది.

అధికారులకు అనివార్య పరిస్థితి

ఈ డబుల్ బెడ్ రూం ఇళ్లలో ప్రస్తుతం మల్లన్నసాగర్ బాధితులు తాత్కాలికంగా నివాసముంటున్నారు. ప్యాకేజీలు, ఇళ్లు అందక 1,150కిపైగా కుటుంబాలు ఇంకా ఇక్కడే నివాసం ఉంటున్నాయి. వీరి సమస్యలన్నీ పరిష్కరించి ఖాళీ చేయించిన తర్వాతే మున్సిపాలిటీలో పేదలకు అందించే వీలుంది. ముందుగా మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాల్సిన పరిస్థితి అనివార్యమైంది. ఈ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తేనే పంపిణీ ప్రక్రియ ముందుకు సాగే అవకాశముంది.

ఫిర్యాదులు 700కుపైగానే..

ఈనెల 3న ప్రకటించిన జాబితాలో అర్హత ఉన్న తమ పేర్లు గల్లంతయ్యాయని, కొందరు అనర్హులకు కూడా జాబితాలో చోటు కల్పించారని వందలాది మంది పేదలు ఈనెల 4వ తేదీన రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించిన సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలోనే అధికారులు అర్హులైన మరోసారి దరఖాస్తు అందజేయడానికి, అనర్హుల వివరాలను అందించడానికి మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఫిర్యాదు బాక్స్‌లను ఏర్పాటు చేశారు. దీతో ఇప్పటివరకు 700కుపైనే ఫిర్యాదులు వచ్చాయి. వీటి పరిష్కారం కూడా అధికారులకు సవాలుగానే మారింది.

> **కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుకు**
>
> గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ ఇళ్ల పంపిణీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుకు సాగుతాం. మల్లన్నసాగర్ నిర్వాసితులను ఖాళీ చేయించే అంశం, ఈనెల 3న ఇచ్చిన లబ్ధిదారుల జాబితాపై ఫిర్యాదులను నివేదించి ఆ తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
>
> –విజయేందర్‌రెడ్డి, గజ్వేల్ ఆర్డీఓ

10 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



మాట్లాడుతున్న ఎంసీఏ సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మిరుదొడ్డి క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి మిరుదొడ్డి మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఎంసీఏ సభ్యులు మొగుళ్ల ఐలయ్య, గంజి కొండల్‌రెడ్డి, గొల్ల విజయ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి సహకారంతో నిర్వహించే టోర్నీకి ఆసక్తి కలిగిన క్రీడా టీంలు ఈ నెల 9 లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లా క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని సూచించారు.విజేత టీంకు రూ. 20 వేలు, రన్నర్ టీంకు రూ.10 వేల నగదు పురస్కారంతోపాటు, మ్యాన్ ఆఫ్ దీ సిరీస్ రూ.3 వేలు, ట్రోఫీలు అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9948525027, 8686718387 నంబర్లల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంసీఏ సభ్యులు నరేష్, నాగరాజు, వినోద్, అజయ్, సుధాకర్, కవిరాజు, సతీష్, లచ్చాగౌడ్, పర్వరాములు, సదానందం, గోపి ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు



వర్గల్(గజ్వేల్): 2023–24 విద్యాసంవత్సరం నవోదయలో ఆరోతరగతి ప్రవేశానికి దరఖాస్తు స్వీకరణ గడువును నవోదయ విద్యాలయ సమితి ఈ నెల 15 వరకు పొడిగించిందని వర్గల్ పాఠశాల ప్రిన్సిపాల్ జీ రమేశ్‌రావు తెలిపారు. 8వ తేదీన గడువు ముగియాల్సి ఉండగా విద్యార్థుల ప్రయోజనం కోసం మరోసారి పొడిగించినట్లు వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులు http://navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రఘురాం

సిద్దిపేటకమాన్: ఈ నెల 11వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం సూచించారు. సిద్దిపేట కోర్టు సమావేశ మందిరంలో ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, స్టాండింగ్ కౌన్సిల్ కక్షిదారుల న్యాయవాదులతో న్యాయమూర్తి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద మొత్తంలో కేసులు పరిష్కరించి రాష్ట్రంలో సిద్దిపేట ముందు వరుసలో ఉండే విధంగా అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తి స్వాతిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన తూంకుంట నర్సారెడ్డి



రేవంత్‌రెడ్డితో నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ములుగు నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆయనతో పాటు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు శివారెడ్డి, నక్క రాములుగౌడ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం



అద్దాలు అందజేస్తున్న రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): పేదలకు మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 49 గ్రామాలు, 17 వార్డుల్లో వైద్య పరీక్షలు పూర్తయ్యాయన్నారు. 19,442 మందికి రీడింగ్ అద్దాలు, 14,442 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షులు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ వనిత రవీందర్‌రెడ్డి, సర్పంచ్ కాముని ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ సభ్యులు శారద రమేశ్, శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యులు సరిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

91,285 మందికి కంటి పరీక్షలు

సిద్దిపేటకమాన్: జిల్లాలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలోని 47 బృందాల వైద్య సిబ్బంది మంగళవారం 6,872 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 1,537 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 91,285 మందికి పరీక్షలు నిర్వహించి 20,891 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

టీబీ బాధితులకు టీహెచ్‌ఆర్ న్యూట్రిషన్ కిట్స్

- ఆరు నెలల పాటు అందజేత
- సిద్దిపేట నియోజకవర్గంలో 277 మందికి మనోధైర్యం



న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తున్న రాంచందర్‌రావు

సిద్దిపేటకమాన్: క్షయ(టీబీ) బాధితులు పోషకాహారం తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతుంటారు. అలాంటి వారికి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అండగా నిలుస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం నింపుతూ, మనోధైర్యాన్ని కల్పిస్తూ, కడుపు నిండా తిండి అందించి రోగ నిరోధకశక్తిని పెంపొందించేలా ప్రత్యేకంగా టీహెచ్‌ఆర్ న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తున్నారు. మంత్రి సొంత ఖర్చులతో సిద్దిపేట నియోజకవర్గంలోని 277 మంది టీబీ పేషెంట్లకు నాలుగు రకాల వస్తువులతో కూడిన ఈ కిట్‌లను అందజేస్తున్నారు. ప్రతీ నెల 5, 6, 7వ తేదీల్లో మంత్రి వ్యక్తిగత సహాయకులు రాంచందర్‌రావు (రాము), డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేస్తున్నారు. ఆరు నెలల వరకు వారికి అందజేయనున్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారు మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధకశక్తి పెరుగనుంది. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

గుడిసెవాసుల గోడు పట్టదా?



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: గుడిసెల్లో నివస్తున్న పేదల బతుకులు ప్రభుత్వానికి కన్పించడం లేదా? 40 ఏళ్ల జీవితం గుడిసెలోనే గడిచినా ఇక వారికి సొంత ఇల్లు ఎప్పుడు ఇస్తారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం కూచనపెల్లి గ్రామంలోని పేదల గుడిసెలను ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత సొంత ఇల్లు వస్తుందని, బతుకులు మారుతాయని భ్రమపడిన పేదల బతుకులు అలాగే ఉన్నాయన్నారు. కలెక్టర్ స్పందించి ఈ గ్రామంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న పేదలకు ఇంటి స్థలాలకు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూం ఇళ్లలో వీళ్లకు తొలి ప్రాధాన్యః ఇవ్వాలన్నారు. ఆయన వెంట బోయిని అశోక్, గడిపె మల్లేశ్, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో పేరును నిలబెట్టాలి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి బీహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులు జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టాలని స్పోర్ట్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ పాల సాయిరాం సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే అథ్లెటిక్స్ జట్టు క్రీడాకారులకు మంగళవారం జిల్లా కేంద్రంలో క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రి హరీశ్‌రావు పేరును నిలబెట్టాలన్నారు. అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ జిల్లా నుంచి పదిమంది బాలురు , ముగ్గురు బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. కోచ్‌గా నిషాంక్ గౌడ్, మేనేజర్‌గా స్వామి వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా క్రీడా దుస్తుల దాత మెరీడియన్ పాఠశాల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, ఉప్పలయ్య, కృష్ణ కుమార్, మహేష్ , కరుణకర్ రెడ్డి, లీలా ఆనంద్, సాయికృష్ణ, వినోద్, నరేష్, వెంకట్ రెడ్డి, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



సంత పనులను ప్రారంభిస్తున్న రమేశ్

జెడ్పీ సీఈఓ రమేశ్

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. మంగళవారం పంచాయతీ పరిధిలో ఆయన సామూహిక గ్రామీణ సంత నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు నాణ్యతతో పాటుగా వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీఓ ఖాజమెయినోద్దీన్, ఈసీ పరుశరాములు, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కంటి సమస్యలపై ప్రజలు నిర్లక్ష్యం వహించొద్దని గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు చేసుకోవాలని జెడ్పీ సీఈఓ రమేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని ధర్మారం, వంగపల్లిలో శిబిరాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వైద్యా శిబిరాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరీక్షలు చేయించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు ఊట్ల రవీందర్‌రెడ్డి, గంగి భాగ్యలక్ష్మీశ్రీనివాస్, ఎంపీఓ ఖాజా మొయినిద్దీన్, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరుతు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌కు 2,037 మంది నమోదు



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో రన్నింగ్ అసోసియేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 12వ తేదీన నిర్వహించే హాఫ్ మారథాన్‌కు పలు జిల్లాల నుంచి 2,037 మంది పేర్లను నమోదు చేసుకున్నారని ఏసీపీ సతీశ్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఏనే వద్ద 5కే, 10కే, 21కే మూడో ఎడిషన్ హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసిందన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, నిత్యం నడకను అలవాటుగా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సీపీ శ్వేత హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు శ్రీధర్, వివేక్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భాషా పండితులను గుర్తించాలి

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం భాషా పండితులను గుర్తించి వేతన సవరణ చేసి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఇవ్వాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జెడ్పీ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బతుకమ్మ ఆడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 ఏళ్లుగా వెట్టి చాకిరి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అశోక్, ప్రవీణ్, ఉమ, మాధవి, లలిత, విజయ లక్ష్మి, కరుణ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

ఎర్రబడి.. కుళ్లిపోయి

- చచ్చిపోతున్న వరిపంట
- మందులు కొట్టినా లాభం లేక మళ్లీ నాటేస్తున్న రైతులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది దుబ్బాక పట్టణానికి చెందిన రైతు గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డి. తనకున్న 12 ఎకరాల్లో వరి సాగుచేశాడు. నాటేసి నెలరోజులు దాటిపోతున్నా వరి పచ్చపడకుండా ఎర్రబడి కుళ్లిపోయింది.. ఏ మాత్రం ఎదుగుదల లేకుండా చచ్చిపోయింది. రెండుసార్లు దుక్కిమందు, యూరియా, సల్ఫర్, పొటాష్ చల్లినా లాభం లేదు. ఎంతో ఖర్చు పెట్టి పవర్‌ఫుల్ ఎంగ్రిన్ గోళీలు చల్లాడు. ఫర్టిలైజర్ షాపుల వారిచ్చిన మందులు రెండు మూడు రకాలు కలిపి స్ప్రే చేసినా పంట కోలుకోలేదు. ఇప్పటికే వేల రూపాయల మందులు తెచ్చి కొట్టిన.. మట్టిలో పోసినట్టే అయ్యింది..రెండు లక్షలు పెట్టుబడి పెట్టిన. అందరి చేలు గిట్లనే ఎర్రబడి పోతున్నాయి.. ఏం అర్థమవుతలేదు. పంట ఎట్ల కోలుకుంటదో ఏమో తెలవడం లేదు. వానాకాలంలో పంట దిగుబడి రాక లక్ష రూపాయలు మీదపడ్డయి' అంటూ తన గోడు వెల్లబోసుకుండు.



ఎర్రబడి , కుళ్లి ఎండిపోతున్న వరి పంట

దుబ్బాకటౌన్: రైతుల పరిస్థితి గోటిచుట్టపై రోకలి పడ్డ చందంగా తయారైంది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినా తీరా పంటలు చేతికొస్తాయన్న గ్యారంటీ లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అసలే వానాకాలంలో మొగిపురుగు రోగం, భారీ వర్షాలతో పంటలు బాగా దెబ్బతిని దిగుబడి రాక రైతులకు పెట్టుబడి కూడా వెళ్లలేదు. ఈ యాసంగిలోనైనా పంటలు బాగా పండుతాయన్న ఆశతో వరి సాగుచేశారు. తీరా వరినాట్లు వేసి నెలరోజులు గడుస్తున్నా వేసిన పంట పచ్చబడి ఎదగకుండా ఎర్రబడి కుళ్లిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట వేసినప్పటి నుంచి ఏమందు వేసినా, కోలుకోలేదు.

2.30 లక్షలకు పైగా ఎకరాల్లో వరిసాగు

సిద్దిపేట జిల్లాలో చెరువులు..కుంటల్లో సంవృద్ధిగా నీరుండడంతో ఈ యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున వరిసాగు చేస్తున్నారు. 2.90 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా కాగా, ఇప్పటి వరకు 2.30లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. వేసిన వరి మాత్రం పచ్చబడకుండా, ఎదుగుదల లేకుండా కుళ్లిపోతూ మొక్కలు చచ్చిపోయి పొలాల్లో పెద్ద గ్యాబులు (ఖాళీ స్థలాలు) ఏర్పడుతున్నాయి. మొగిపురుగు ఉధృతి, వాతావరణ పరిస్థితులే కారణమని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఇవీ కారణాలు

- రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువ ఉండడంతోనే వరి చేలు ఎర్రబడి, కుళ్లి పోయినట్లు అవుతున్నాయి.
- వర్షాకాలంలో వానలకు పొలాల్లో నీరు బాగా నిలిచి భూమి ఆరలేదు. మళ్లీ వరి వేయడంతో వేరువ్యవస్థ కుళ్లి పోతూ ఎదుగుదల లేకుండా అయ్యింది.

ఐదు ఎకరాలు మళ్లీ నాటేసిన



డిసెంబర్‌లో నాటేసిన వరి మొత్తం ఎర్రబడి కుళ్లిపోయి చచ్చిపోయింది. గత్యంతరం లేక వేరేదగ్గర నారు తెచ్చి మళ్లీ నాటేసిన. ఇప్పటికే లక్ష రూపాయలు పెట్టుబడి అయ్యింది. కనీసం పెట్టుబడి కూడా వస్తదో లేదో. చాలా మంది రైతులు దున్ని మళ్లీ నాట్లేస్తుండ్రు. గిసొంటి పరిస్థితి నేను ఎప్పుడు చూడలే. రైతులు చాల అవస్థలు పడుతుండ్రు.

–మల్లేశం,ధర్మాజీపేట

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వరి చేలు మొగిపురుగు, చలి తీవ్రతతోనే ఎర్రబడి, ఎదుగుదల లేకపోవడంతో పాటు వానాకాలంలో నీరు పొలాల్లో నిల్వ ఉండడం మళ్లీ భూమి ఆరకుండానే పంటలు వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో తిరుగుతూ పంటలను పరిశీలిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే (ఎండలు ముదిరితే) మళ్లీ వరిపంటలు బాగవుతాయి.

–శివప్రసాద్,జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

సర్పంచ్ భర్తపై కేసు నమోదు చేయాలి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో ఎస్టీ మహిళ కమలమ్మకు చెందిన భూమిని ఆక్రమించి ఆమెను భయాందోళనకు గురి చేస్తున్న సర్పంచ్ జయంతి భర్త నరేందర్‌పై భూ కబ్జా, ఎస్సీ ఎస్టీ అత్యాచారాల కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పి.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కుకునూరుపల్లిలో బాధితులతో కలిసి భూమిని పరిశీలించారు. అనంతరం బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సర్వే నంబర్ 533లోని 7 గుంటల భూమిని సర్పంచ్ భర్త నరేందర్ కబ్జా చేయడమే కాకుండా బాధితురాలని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు ఆర్.లక్ష్మి, దాసరి ఏగొండ స్వామి తదితరులు ఉన్నారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలనకు అనుమతి

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల పరిశీలనకు అనుమతి లభించినట్లు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ (సీసీఆర్) సెంట్రల్ కమిటీ మెంబర్ సీహెచ్ శ్రీనివాస్, స్టేట్ జాయింట్ సెక్రటరీ గుండ్ల శివ చంద్రం, మీడియా కోఆర్డినేటర్ సాజిద్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కొండపాక మండల కార్యాలయ రికార్డుల తనిఖీల కోసం దరఖాస్తుచేయగా, పౌరసమాచార అధికారి సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ తప్పుడు సమాచారాన్ని ఇచ్చారన్నారు. దీనిపై జిల్లా సభ్యులు మొదటి అప్పిలెట్ అధికారి గజ్వేల్ ఆర్డీఓకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు పరిశీలించిన ఆర్డీఓ కొండపాక మండల రెవెన్యూ కార్యాలయ పౌరసమాచార అధికారికి రికార్డుల పరిశీలనకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారన్నారు. దీంతో కొండపాక మండల కార్యాలయ పౌర సమాచార అధికారి నుంచి రికార్డుల పరిశీలన కోసం ఈనెల 14, 15, 17 తేదీల్లో అనుమతి లభించిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ నేతకు గాయాలు

జహీరాబాద్: పట్టణ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడటంతో న్యాల్‌కల్ మండల జెడ్పీటీసీ భర్త, బీఆర్ఎస్ నేత భాస్కర్ గాయపడ్డాడు. ఈఘటన మంగళవారం జరిగింది. ప్రమాదంలో గాయపడిన భాస్కర్‌ను వెంటనే జహీరాబాద్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, మొగుడంపల్లి జెడ్పీటీసీ అరుణ మోహన్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ ఆయనను పరామర్శించారు. ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ధ్యానంతో మానసిక పరిపక్వత

దుబ్బాకటౌన్: విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకుంటూ ధ్యానం చేస్తే శారీరకంగా, మానసికంగా పరిపక్వత సాధిస్తారని పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని సరస్వతి గ్లోబల్ స్కూల్‌లో పౌష్టిక ఆహారం, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగ, ధ్యానం, పౌష్టికాహారంపై విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు.

నీటి యాజమాన్యంతో హెచ్చు దిగుబడి

- ఆరుతడి పంటలతో మేలు
- పొలాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి
- భూగర్భ జాలాల పెంపుతో సాగుకు అనుకూలం
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింగ్‌రావు


మన్‌సాన్‌పల్లిలో మిరప కాయలు, వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్న దృశ్యం

మునిపల్లి(అందోల్): వివిధ రకాల కూరగాయల పంటల సాగు చేస్తే రైతుకు మేలు జరుగుతుందని, సాగులో నీటి యజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి నర్సింగ్‌రావు అన్నారు. పంటల సాగులో నీటి యాజమాన్య పద్ధతులు వివరించారు.

- రైతులు తమ పొలాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీరు, ఇతర నీరు అందులోకి వెళ్లి నిల్వ ఉంటుందన్నారు. దీంతో సమీపంలో భూ గర్భ జలాలు పెరిగి ఆ నీటిని సాగుకు వినియోగించుకోవచ్చని చెప్పారు.
- అలాగే అన్ని రకాల పంటలకు కొమ్మలు వచ్చే దశలో నీటి తడులు అందించాలన్నారు.
- రైతులు ఈ దశలో అప్రమత్తంగా వ్యవహరించి పంటలకు కీలకమైన పూత దశలో పంట నీటి ఎద్దడికి గురైతే 50 శాతం కన్నా ఎక్కువ దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. పంటలకు గింజ, కాయ కట్టే దశలో నీటిని అందించాలన్నారు.
- జొన్న పంటకు సాధారణంగా 400 నుంచి 660 మిల్లీమీటర్ల నీరు అవసరం ఉంటుందని చెప్పారు. అలాగే మొక్క జొన్నకు 400–550 మి.మీ. నీరు, వేరు శనగతో పాటు ఇతర చిరు ధాన్యాలకు 300–400 మి.మీ. నీరు అవసరం ఉంటుందని తెలిపారు.
- ఇందులో మొదటి తడి మొక్కలు నాటిన తర్వాత 15–18 నుంచి రోజులలోపు నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. చివరి తడి పంట తీసే 15 నుంచి 28 రోజుల లోపు నీరందించాలని, నీటి పారకం ద్వారా కాకుండా మొక్కల మొదట్లో నీరందిస్తే వేర్లకు నీరు తొందరగా చేరుతుందన్నారు.
- రైతులు ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి సస్య రక్షణ చేపట్టాలన్నారు.
- పంటల సాగులో నీటి వినియోగాన్ని బట్టి పొదుపుగా వాడితే అధిక దిగుబడులు సాధించడమే కాకుండా విలువైన నీటిని కాపాడుకోవచ్చని చెప్పారు.

చెరకు, వరి, కూరగాయలు సాగవుతున్నాయి



జిల్లాలో 11 వేల హెక్టార్లలో ఆరుతడి పంటలు సాగవుతున్నాయి. 9 వేల హెక్టార్లలో వరి, 7,026 హెక్టార్లలో శనగతో పాటు వివిధ రకాల కూరగాయలు, బెండకాయ, వంకాయ, మిరపకాయ, చిక్కుడు కాయ తదితర పంటలను రైతులు పండిస్తున్నారు.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి


శిశువును ఐసీడీఎస్ అధికారికి అప్పగిస్తున్న ఎస్ఐ (ఇన్‌సెట్) ఆడ శిశువు

అయ్యో పాపం.. పసిగుడ్డు

- ఇంటి సమీపంలో వదలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు
- సర్పంచ్, పోలీసులకు సమాచారం ఇచ్చిన ఆశ వర్కర్
- ఆస్పత్రికిలో చికిత్స చేయించి శిశువిహార్ తరలింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదలి వెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆశ వర్కర్ తెల్లవారు జామున పాలను తీసుకువచ్చేందుకు వెళ్లింది. ఓ ఇంటి సమీపంలో పాప ఏడుస్తున్న శబ్దం వినిపించింది. అక్కడికి వెళ్లి చూడగా అప్పుడే పుట్టిన ఆడ శిశువు కనిపించింది. వెంటనే సమాచారాన్ని గ్రామ సర్పంచ్, హద్నూర్ పోలీసులకు తెలిపింది. అక్కడకు చేరుకున్న ఎస్ఐ వినయ్‌కుమార్ తన వాహనంలో శిశువును జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్య సిబ్బంది శిశువుకు చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతాబాయి ఆస్పత్రికి వచ్చి ఎస్ఐ, అంగన్‌వాడీ కార్యకర్త సంగీతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్స అనంతరం శిశువును ఎస్ఐ ఐసీడీఎస్ సూపర్ వైజర్‌కు అప్పగించారు. అక్కడ నుంచి శిశువును సంగారెడ్డిలోని శిశు విహార్‌కు తరలించారు. శిశువు క్షేమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆడ బిడ్డ పుట్టినందు వల్లే గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలి వెళ్లి ఉండవచ్చునని పలువురు తెలిపారు.

ఎంపీపీకి పొంచి ఉన్న పదవి ముప్పు

- తప్పుడు ధ్రువీకరణ పత్రాల సమర్పణపై 2020లో ఫిర్యాదు
- ధ్రువీకరణ పత్రాలపై విచారణకు ఆదేశించిన కలెక్టర్


జ్యోతి సురేశ్ నాయక్

నర్సాపూర్ రూరల్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి సురేశ్ నాయక్ ఎంపీపీ పదవి చేపడుతోందని చిప్పలతుర్తి ఎంపీటీసీ సంధ్యారాణి 2020లో కలెక్టర్ హరీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపట్టాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించగా అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణలో ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ వయసుకు సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ఎంపీపీగా కొనసాగుతోందని తేలినట్టు సమాచారం. స్కూల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ తదితర గుర్తింపు కార్డులకు ఒకదానితోఒకటి పొంతన లేకుండా ఉన్నట్టు విచారణలో తేలినట్టు సమాచారం. ఈ నెలలో మరోసారి విచారణ చేపడతారని, తుది విచారణలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలుగా రుజువైతే ఎంపీపీ పదవిపోవడంతో పాటు కేసు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్టు వినికిడి. బీఆర్ఎస్ పార్టీ నుంచి చిప్పలతుర్తి ఎంపీటీసీ సంధ్యారాణి నాయక్, కాంగ్రెస్ పార్టీ నుంచి జ్యోతి సురేశ్ నాయక్ పోటీలో నిలిచారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ఎంపీటీసీ లు సమానంగా ఉండటంతో ఎన్నికల సమయంలో డ్రా తీయగా జ్యోతి సురేష్ నాయక్ పేరు వచ్చింది. అప్పటినుంచి జ్యోతి ఎంపీపీగా కొనసాగుతోంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జహీరాబాద్: గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని కనుగొన్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పస్తాపూర్ కమాన్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతుడిది సహజ మరణంగా భావిస్తున్నామన్నారు. మృతుడు బ్లూ చెక్స్‌షర్టు, నల్లరంగు ఫ్యాంటు ధరించాడని, కుడిచేతిపై పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

నర్సాపూర్: అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు తమ వంతు ప్రయత్నాలు చేయాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత అన్నారు. సోమవారం కోర్టులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం, యోగ, ఆటలు ఆడటం అలవాటు చేసుకోవాలన్నారు. శిబిరంలో కంటిపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ విజయనిర్మల, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జానజీం బేగ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రఘువరన్, డాక్టర్ సామిత్య రత్న, ఏపీపీ రాఘవేంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం


ఈశ్వరమ్మ (ఫైల్)

ఝరాసంగం (జహీరాబాద్): కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామానికి చెందిన జి.ఈశ్వరమ్మ ఈనెల 4వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కుమారుడు నాగరాజు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.

సంగారెడ్డి టౌన్: ఇష్టం లేని పెళ్లి చేశారని ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లింది. ఈ ఘటన సంగారెడ్డిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌పల్లి గ్రామానికి చెందిన రమ్యకు అదే గ్రామానికి రఘువీర్‌గౌడ్‌తో గత ఏడాది జూలై లో వివాహం జరిగింది. ఈ నెల 5వ తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత అందరూ నిద్రించారు. 6వ తేదీ ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసే సరికి ఆమె కనిపించలేదు. తనకు ఇష్టంలేని పెళ్లి చేశారని, తన కోసం వెతకవద్దని లెటర్ రాసి, మంగళ సూత్రం, మెట్టెలు వదిలి వెళ్లింది. భర్త రఘువీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. మంగళవారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 40 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 37 మందికి ఒకొక్కరికి రూ.2 వేలు, మరో ముగ్గురికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు మంగళవారం జరిమానా విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్ బాబు రూ.17వేల జరిమానా విధించారు.

సింగరేణి బొగ్గు కాజేస్తున్న ముఠా అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన దృశ్యం

కేసు నమోదు చేసిన టాస్క్‌ఫోర్స్

చిన్నకోడూరు(సిద్దిపేట): సింగరేణి రవాణా చేస్తున్న బొగ్గు లారీలను మార్గం మధ్యలో ఆపి బొగ్గును ఓ ముఠా కాజేస్తోంది. ఆటోల్లో లోడు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వాహనాలను తనిఖీల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తెలిపారు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజాముున మండల పరిధి రామునిపట్ల శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సింగరేణి నుంచి వెళ్తున్న బొగ్గు లారీలను రామునిపట్ల వద్ద ఆపి బొగ్గును ఆటోల్లో లోడ్ చేస్తున్నారు. బొగ్గు తరలిస్తున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. 64 టన్నుల బొగ్గు, రెండు లారీలు, ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముల్కల మహేశ్, చెరుకు మహేశ్, మహ్మద్ డేవిడ్, భూక్యా రాజు, వేణి శంకర్, తిరుమానుజన్‌లపై కేసు నమోదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


కౌడిపల్లి అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో అధికారులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): అడవి నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్లను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం కౌడిపల్లి ఎఫ్ఆర్ఓ ఎల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి రేంజ్ పరిధి కొంగోడ్ అడవి నుంచి ప్రభుత్వం అనుమతులు లేకుండా ట్రాక్టర్ యజమానులు ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా రావాణా చేస్తున్నారు. అడివిలో గస్తీ సిబ్బందికి ఇసుక నింపిన మూడు ట్రాక్టర్లు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. అడవిలో అక్రమంగా ఇసుక తవ్వడం, చెట్లు నరకడం నేరమని తెలిపారు.

చోరీ నిందితుడి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి తాను అద్దెకు ఉంటున్న ఇంటిలో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో చోటు చేసుకుంది. మంగళవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కుసంగి అనసూయ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్‌లో ఉద్యోగం చేస్తోంది. సంక్రాంతి సెలవులకు తన పుట్టిల్లు జోగిపేట వెళ్లి జనవరి 17వ తేదీన ఇంటికి వచ్చింది. జనవరి 16వ తేదీన అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని బంగారం, డబ్బు ఎత్తుకెళ్లినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా అనసూయ ఇంటిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ అన్సారి అద్దెకుంటున్నాడు. చోరీ అనంతరం తన రాష్ట్రానికి వెళ్లిపోయాడు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లి నిందితుని పట్టుకున్నారు. అతడి నుంచి బంగారు ఆభరణాలు, డబ్బును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రామరాజు పంతులు చేసిన సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీకి రామరాజు పంతులు చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ రాష్ట మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల ఆశాజ్యోతిలో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి చాడా రామరాజు పంతులు ప్రథమ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో రెండు దశాబ్దాలకు పైగా ఎలాంటి పదవులను ఆశించకుండా అధిష్టానం ఇచ్చిన ప్రతి పనిని కాంగ్రెస్ నాయకులందరి సమన్వయంతో విజయవంతం చేయడంలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. రామరాజు పంతులు భౌతికంగా లేకపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఆయనను మరువదన్నారు. ఆశాజ్యోతిలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండు లక్ష్మణ్, డప్పు గణేశ్, సమీర్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ఇటుక బట్టీ

- ట్విట్టర్ వేదికగా సీఐడీకి ఫిర్యాదు
- నిర్బంధంలో ఉన్న ఆరుగురు ఒడిశా కార్మికుల విముక్తి
- ఇటుక బట్టీ యజమానిపై కేసు నమోదు
- కూలీలకు వారి వేతనం ఇప్పిస్తామన్న అడిషనల్ ఎస్పీ


వివరాలను వెల్లడిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా సీఐడీ విభాగం అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు

మెదక్ రూరల్: ట్విట్టర్ వేదికగా ఇచ్చిన ఫిర్యాదుపై సీఐడీ అధికారులు స్పందించారు. ఇటుక బట్టీపై దాడులు నిర్వహించి నిర్బంధంలో ఉన్న ఆరుగురు ఒడిశా కార్మికులకు విముక్తి కల్పించారు. ఇటుక బట్టీ యజమానిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. మంగళవారం మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి జిల్లా సీఐడీ విభాగం అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా, మెదక్ మండలం మాచవరం శివారు ఇటుక బట్టీలో పనిచేయడానికి వచ్చిన ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు కార్మికులను యజమాని తుమ్మల లక్ష్మీనారాయణ కొంత కాలంగా నిర్బంధించి వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితుల తరపున వ్యక్తులు ట్విట్టర్ వేదికగా ప్రభుత్వానికి ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సీఐడీ విభాగం అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులతో కలిసి విచారణ జరిపినట్లు తెలిపారు. ఇటుక బట్టీలో పనిచేసేందుకు వచ్చిన ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు, రెండేళ్ల చిన్నారికి సదరు యజమాని లక్ష్మీనారాయణ సరైన వసతులు కల్పించకుండా, కూలీ డబ్బులు చెల్లించకుండా, బలవంతంగా ఎక్కువ సమయం పని చేయిస్తున్నాడు. కూలీ డబ్బులు అడిగితే అసభ్యంగా మాట్లాడుతూ వారిని అవమానించడంతోపాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఇటుక బట్టీలో నిర్బంధించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిర్బంధంలో ఉన్న ఒడిశా కార్మికులు గత్‌వాల్ రాణా, ముకుంద్ రాణా, సురేంద్ర రాణా, సుదమ్ రాణా, నీరు బథోయ్, రెండేళ్ల చిన్నారి ప్రద్యూమ్ బథోయ్‌ను ఇటుక బట్టీ యజమాని చెర నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. అలాగే వారికి రావాల్సిన రూ.37 వేల వేతనం ఇప్పించడం జరుగుతుందన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బాధిత కార్మికులను తమ స్వస్థలానికి ప్రత్యేక వాహనంలో పంపించినట్లు తెలిపారు. ఈ విషయంపై మెదక్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యేంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఇటుక బట్టీ యజమాని లక్ష్మీనారాయణపై మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇంటర్ స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ యాక్ట్, చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ రిస్క్యూలో సీఐడీ డీఎస్పీ నోముల వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ విజయ్ కుమార్, సీఐడి సీఐలు జగదీశ్వర్, సురేష్, ఎస్ఐలు కృష్ణమూర్తి, అంజయ్య, లేబర్ ఆఫీసర్లు ప్రవీణ్, ఆర్ఐ నాగరాజు, ఏఎస్ఐ వెంకటయ్య తదితరులు ఉన్నారు.

చేపల వల కాళ్లకు చుట్టుకొని..

నీట మునిగి వ్యక్తి మృతి


లక్ష్మయ్య మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): చేపలు పట్టేందుకు విసిరిన వల కాళ్లకు చుట్టుకొని నీటమునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హత్నూర మండలం నవాబుపేట గ్రామానికి చెందిన నాయికోటి లక్ష్మయ్య(50), మంజుల దంపతులు హత్నూరలో నివాసం ఉంటున్నారు. గ్రామ శివారు కుంటలో చేపలు పట్టేందుకు సోమవారం రాత్రి 9 గంటలకు లక్ష్మయ్య ఇంటి నుంచి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజాము వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు గ్రామ శివారులోని పలు కుంటలవద్ద వెతికారు. సాలం సాబ్ కుంట కట్టపై లక్ష్మయ్య దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో ఆ కుంటలో గాలించగా లక్ష్మయ్య కాళ్లకు చేపల వల చుట్టుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి కేసునమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

విలువైన రాగి వైరు చోరీ


ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

జోగిపేట(అందోల్): పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. తూర్పు వీరారెడ్డి పొలంలో ఉన్న 25 హెచ్‌పి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగివైరు ఎత్తుకెళ్లారు. సదురు రైతు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అపహరించిన రాగి వైరు విలువ రూ.30 వేల వరకు ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.